# 1

# “లోపముగా ఉన్నవాటిని దిద్దుము”

## (తీతు 1:1-9)

*ఈ క్రింద చెప్పబడిన వాటికి నేపథ్యాన్ని అందించడం ఈ ప్రసంగ ఉద్దేశం. ఈ పాఠాన్ని సిద్ధపరుస్తుండగా, సంఘ నిర్దిష్ట అవసరతల గురించి ఆలోచించి ప్రార్థించండి. ఒకే ప్రసంగం అన్ని సంఘాలకు సరిపోదు. ఒక సంఘంలో నేను అనుసరించిన విధానాన్ని చూపేందుకు ఇది ఒక మాదిరి.*

దేవుని పనికి మంచి నాయకత్వం ఎంతో అవసరం. పాతనిబంధనలో కనబడే తీవ్ర ఆరోపణలు ఖండనలు దేవుని ప్రజలను సరిగా నడిపించలేని వారి గురించే. క్రొత్త నిబంధనలో, మత్తయి 23లో, యేసు పలికిన *పరుష* పదాలు శాస్త్రులు, పరిసయ్యుల గురించి, వారు మంచి ఆత్మీయ నాయకులుగా ఉండాల్సింది కానీ అలాలేరు. సరైన నాయకత్వం లేనప్పుడు, దేవుని పని సక్రమంగా జరుగదు.

తీతు 1:5లో పౌలు తీతుతో ఇలా చెప్తున్నాడు – “నేను నీకు ఆజ్ఞాపించిన ప్రకారము నీవు లోపముగా ఉన్నవాటిని దిద్ది, ప్రతిపట్టణములోను పెద్దలను నియమించు నిమిత్తము నేను నిన్ను క్రేతులో విడిచి వచ్చితిని.”[1] ఈ పాఠం యొక్క ఉద్దేశమేమంటే (యిక్కడ స్థానిక సంఘం పేరు) స్థానిక సంఘంలో పెద్దలను నియమించడం ద్వారా “లోపముగా ఉన్నవాటిని దిద్దడం.” (సంఘంలోని అవసరతను పేర్కొని, పెద్దలను నియమించే విధానాన్ని తెలియచెప్పడం.) అయితే పెద్దలను నియమించడం అనేది (వివరించిన విధానం) అంత సులభం కాదు. ఒక్కోసారి పెద్దలను నియమించడం అనేది సంఘంలో దుష్ప్రభావాన్ని చూపిస్తుంది. ఒక్కొక్కరి మనోభావాలు దెబ్బతింటాయి. *పరుష* పదాలు వాడాల్సివస్తుంది.

ఈ పాఠాలు పెద్దల నియామక విషయంలో ఎంతో ఉపకరిస్తాయి. ఇందులో ఎలాంటి నిగూఢాంశములు లేవు. పెద్దల నియామకం, మీ మీద, సంఘం మీద ఉంది. ఇది దేవుని ప్రణాళిక.

ఇవి పెద్దరికంలోని కాపరి స్వభావాన్ని చూపిస్తాయి. మొదటిగా, మనం కొన్ని సాధారణ విషయాలను చూద్దాము. మన ఉద్దేశాన్ని మనం ఎలా నెరవేర్చగలం?

### సంఘం ఏం చేయాలి

#### పెద్దల నాయకత్వాన్ని ఘనమైనదిగా ఎంచండి

“లోపముగా ఉన్నవాటిని సరిదిద్దుటకు” స్థానిక సంఘం ఏం చేయాలో ఆలోచిద్దాం, ప్రత్యేకించిన వారిని మాత్రం కాక, పెద్దల నాయకత్వాన్ని ఘనమైనదిగా ఎంచాలి. “బాగుగా పాలన చేయు పెద్దలను, విశేషముగా వాక్యమందును ఉపదేశమందును ప్రయాసపడువారిని రెట్టింపు సన్మానమునకు పాత్రులునుగా ఎంచవలెను” అని 1 తిమోతి 5:17లో పౌలు

చెప్పుచున్నాడు. “రెట్టింపు సన్మానం” అంటే, ఇందులో *గౌరవం* మరియు వారు పూర్తికాలం ఇందులోనే ఉంటే *వేతనం* కలిసి ఉన్నాయి. ఎక్కువ మంది పెద్దలు పూర్తిగా దీనికే కేటాయించరు కాబట్టి రెండవ “సన్మానం” వారికి అవసరం లేదు కానీ పెద్దలందరూ మొదటి “సన్మానముకు” పాత్రలు. అది, గౌరవం.

కమెడియన్ బిల్ కాస్బీ ఒకసారి ఇలా అన్నాడు, ఇంటి పెద్దగా ఉండే విషయమై “నేను ఈ పనిని చూశాను కానీ నాకు ఇది వద్దు.” ఇన్ని సంవత్సరాల కాలంలో ఎంతోమంది “సంఘ పెద్దల పనిని” చేసిన వారిని నేను చూచాను. తమ నిర్ణయాల వలన అభాసుపాలైన పెద్దలను వారు చూచారు కాబట్టి వారికి ఈ పని అవసరంలేదు. ఆ వైఖరిని మార్చాలంటే, మన పెద్దలకు ప్రేమను, *గౌరవాన్ని*, గుర్తింపును ఇవ్వాలి. “మీపైని నాయకులుగా ఉన్నవారు లెక్క ఒప్పచెప్పవలసిన వారివలె మీ ఆత్మలను కాయుచున్నారు. వారు దుఃఖముతో ఆ పని చేసిన యెడల మీకు నిష్ప్రయోజనము గనుక దుఃఖముతో గాక, ఆనందముతో చేయునట్లు వారి మాట విని, వారికి లోబడియుండుడి” అని హెబ్రీయులకు 13:17 చెప్పుతుంది. మీ పెద్దల యెడల మీ వైఖరి సరైనదే అయితే, వారి పని *ఆనందదాయకంగా* ఉంటుంది.

## ఎంచుకునే విధానంలో పాల్గొనండి

ఒక అరుదైన ఘనత క్రైస్తవునకు ఇవ్వబడింది. నియమం ప్రకారం, పాతనిబంధన కాలంలో నాయకులను ఎంచుకునేప్పుడు ప్రజలు భాగస్వాములు అయ్యేవారు కారు, బహూశా అపొస్తలులు ఈ మాట అన్నప్పుడు సంఘానికి ఆశ్చర్యం కలిగియుండవచ్చు – “కాబట్టి సహోదరులారా, ఆత్మతోను, జ్ఞానముతోను నిండుకొని మంచి పేరు పొందిన యేడుగురు మనుష్యులను మీలో ఏర్పరచుకొనుడి” (అపొస్తలుల కార్యములు 6:3). ఏర్పరచుకునే పద్ధతిని అపొస్తలులు సంఘానికే వదిలేశారు, అలాగే మన పెద్దల విషయంలో నీవు, నేను పాలుపొందాలి.

ఇది సంఘమంతటి ప్రయత్నంగా ఉండాలి. ఈ విధానంలో పాల్గొనని కొంతమంది నాకు తెలుసు. ఈ వ్యవహారం తమకు సంబంధించినది కాదని, ఇతరులకు దాన్ని వదిలేస్తుంటారు. మీరలా ఉండవద్దు. దీని గురించి ఆలోచించి ప్రార్థించండి. 1 తిమోతి 3 మరియు తీతు 1లో చెప్పబడిన పెద్దల అర్హతలను మరలా చదవండి. ఈ అర్హతలున్న వారు మీ సంఘంలో ఎవరైనా ఉన్నారేమో చూడండి. అవసరమైనప్పుడు మీ సహాయాన్ని అందించండి.

## పరిపూర్ణులైన వారి కొరకు చూడకండి

సమర్థులైన వారికొరకు చూస్తున్నప్పుడు, పరిపూర్ణులైన వారి కొరకు చూడకండి. ఇంతవరకు ఉన్న వారిలో యేసుక్రీస్తు పరిపూర్ణుడు, పెద్దలు అర్హతలను గురించి చదువు తున్నప్పుడు, పరిపూర్ణులే ఆ అర్హతలను కలిగియుంటారనుకోకూడదు.

తరువాతి పాఠంలో అర్హతల గురించి చర్చించుదాము. ఇందులో కొన్ని *సందర్భానుసారమైనవి*, మరి కొన్ని *ఖచ్చితమైనవి.* సంఘ పెద్ద “ఏకపత్నీ పురుషుడై యుండాలి” (తీతు 1:6). ఇది సందర్భానుసారమైనది అతడికి ఒక భార్య ఉండవచ్చు లేకుంటే ఎవరూ ఉండకపోవచ్చు. సంఘ పెద్ద “ఆతిథ్యమిచ్చు వాడైయుండాలి” (8 వచనం). ఇది ఖచ్చితమైనది. అతనికి ఆతిథ్యగుణం ఉండాలి. లేకుంటే అతడు అర్హుడు కాదు. అయితే

అతడు ఎలా ఆతిథ్యమివ్వాలో వాక్యం చెప్పడం లేదు.

ఆత్మీయా పరిపూర్ణత విషయమై ఒక పెద్దకుండాల్సిన అర్హతలను చూచునప్పుడు సాధారణంగా రెండు విషయాలు జరుగుతాయి (1) కొంతమంది నిరుత్సాహపడతారు. “నేను అర్హుడిని కాలేదు. ఎన్నటికీ నేను అర్హత సాధించలేను” అని వారంటారు. (2) నాయకత్వం నుండి స్వతహాగా తప్పుకోని వారిని ఇతరులు తప్పించేస్తారు.

## మనుష్యులు ఇప్పుడెలా ఉన్నారో వారినలాగే చూడండి

ఈ స్థానిక సంఘు విషయమై నా దగ్గర మంచి మరియు చెడు వార్తలున్నాయి.[2] మొదట మీకేది కావాలి? మంచి విషయమేమంటే, *మనలో అనేకమందికి* ఎన్నో *సంవత్సరాల నుండి ఒకరికొకరు తెలుసు.* మనం కలిసే నవ్వుచున్నాం, కలిసే విచారించాము. ఇది ప్రత్యేక అనుబంధాన్నిస్తుంది. చెడ్డ విషయమేమంటే, మనలో *అనేకమందికి ఎన్నో సంవత్సరాల నుండి ఒకరికొకరు తెలుసు.* మన మధ్య మర్చిపోదగ్గ చెడ్డ అనుభవాలెన్నో ఉన్నాయి. బాధపడ్డ సంఘటనలు, గతంలో చేసిన తప్పులు, చేసిన పాపాలెన్నో ఉన్నాయి. కాబట్టి, సంఘంలోని పురుషల విషయమై ఆలోచిస్తున్నప్పుడు, వారి గత పాపాలను జ్ఞాపకము చేసుకోకుండ ఉండడం కష్టం.

అపొస్తలుడైన పేతురు ఒక సంఘు పెద్దే. “తోటి పెద్దవైన నేను మీలోని పెద్దలను హెచ్చరించుచున్నాను” అని 1 పేతురు 5:1లో పేతురు వ్రాస్తున్నాడు. దైవికంగా ఆయన అపొస్తలుడుగా నియమించబడ్డాడు. అలాగే అపొస్తలుల కార్యములు 6 ప్రకారం ఆయన పెద్దగానూ ఎంచబడ్డాడు. అంటే ఆయన ఉంటున్న సంఘం చేతనే (బహుశ యెరూషలేము సంఘంలో) ఆయన పెద్దగా నియమించబడ్డాడు. ఒక సమర్థవంతమైన పెద్దగా ఆయన్ను మీరూహించగలరా? ఎవరైనా తమ గత జీవితం ఆధారంగా తొలగించబడాల్సి వస్తే పేతురు కూడా తొలగించబడేవాడు? ఆయన అనాలోచితంగానే మాట్లాడే వ్యక్తి. ఆయన యేసును ముమ్మారు తృణీకరించాడు కూడా! గతం ఎలా ఉన్నా అతడు పెద్దగా ఎంచబడ్డాడు.

ఒక వ్యక్తి గతంలో చేసిన దాన్ని బట్టి పశ్చాత్తాపపడ్డాడు అనేందుకు ఏ ఆధారం లేకుంటే, అతని విషయంలో గతాన్ని మర్చిపోమని నేను చెప్పడం లేదు కానీ ఒక వ్యక్తి తన గత దోషాలను బట్టి, పాపాలను బట్టి పశ్చాత్తాపపడి, వాటిని సరిదిద్దుకుని, 1 తిమోతి 3 మరియు తీతు 1 లోని అర్హతల ప్రకారం జీవిస్తుంటే వారి యెడల దేవుని కృపను మరియు కనికరమును మీరు కుదించవద్దు. దేవుడతని పాపములను క్షమించి వాటిని కొట్టివేస్తే వాటిని మరలా ఎత్తేందుకు మనం ఎవరము? ఒక పెద్ద “నిందారహితుడై” (తీతు 1:7), ఉండవలెను దీనర్థం “పాపరహితుడు” కాదు. దీనర్థం ఏమంటే, సంఘం లోపలా, బయటా అతనికి మంచి పేరు ఉండాలన్నది.

## సేవ చేసేందుకు వారిని ప్రోత్సహించండి

మీ సంఘంలోని ఒక వ్యక్తి మంచి పెద్దగా నుండగలడని మీకు అనిపిస్తే, అతడ్ని పరిచర్య చేసేందుకు ప్రోత్సహించండి. ఈ రోజున ఎంతో మంచి బోధకులుగా తయారవుతున్నారు ఎందుకనగా, ఒకాయన ఇలా అన్నాడు, “నువ్వొక మంచి బోధకునిగా కాగలవు. అందుకు నేను ఈ గొప్పపనికి సిద్ధపడుటకు నీకు ప్రోత్సాహమందిస్తాను.” ఇదే విషయం పెద్దల

విషయంలోనూ సరిపోతుంది.

నేను యుక్తవయస్సులో నున్నప్పుడు, 1 తిమోతి 3:1లో "ఆశించడం" KJVలో అన్న పదం ఎక్కువగా నొక్కి చెప్పేవారు:[3] "ఎవడైనను అధ్యక్షపదవిని ఆశించిన యెడల అట్టివాడు దొడ్డ పనిని అపేక్షించుచున్నాడన్న మాట నమ్మదగినది." "పెద్దల యొక్క మొదటి అర్హత ఏమంటే, ఆ పనిని ఆశించడం" అని సహజంగా చెప్తారు. ఒక వ్యక్తి ఎందుకు అర్హతగలవాడు కాదంటే, "అతడు దాన్ని ఆశించలేదు." ఈ పదం గురించి నేను అధ్యయనం చేస్తుంటే, పౌలు చెప్పాలనుకున్నది ఈ విషయం కాదు అని నాకు అర్థమవుతుంది.[4]

అయితే ఒక వ్యక్తి పని చేసేందుకు *ఇష్టం* కలిగియుండాలన్నది సత్యం. "బలిమి చేత కాక దేవుని చిత్త ప్రకారము ఇష్ట పూర్వకముగాను, దుర్లాభాపేక్షతో గాక సిద్ధ మనస్సుతోను, మీ మధ్యనున్న దేవుని యందును పైవిచారణ చేయుచు దానిని కాయుడి" (1 పేతురు 5:2) అని పేతురు పెద్దలకు వ్రాస్తున్నాడు. వాక్య బోధ చేసేందుకు వారు ఇష్టపూర్వకంగా బోధకులుగా నుండేలా ప్రోత్సాహించడం వాక్యానుసారం కాకుండా ఎలా ఉంటుంది? కొంతమంది ఈ స్థానంలోకి వచ్చేందుకు వారు ఆత్మీయంగా ఎదిగేలా ప్రోత్సాహం అవసరమై యుంటుంది. సంఘం కొంతమందిని ఎన్నుకుంటే వారికీ ఈ ప్రోత్సాహం అవసరం ఉంటుంది.

## సంబంధాల మీద పనిచేయడం

సంఘంలో ఎవరి పేరైనా సూచించబడినప్పుడు వారితో మీకు వ్యక్తిగతంగా వ్యతిరేకత ఉంటే ఒక క్రైస్తవునిగా మీరిప్పుడే ఆయన దగ్గరకు వెళ్ళండి.

> "కావున నీవు బలిపీఠము నొద్ద అర్పణము నర్పించుచుండగా నీ మీద నీ సహోదరునికి విరోధమేమైననుకలదని అక్కడ నీకు జ్ఞాపకము వచ్చినయెడల అక్కడ బలిపీఠము నెదుటనే నీ యర్పణము విడిచిపెట్టి, మొదట వెళ్లి నీ సహోదరునితో సమాధానపడుము; అటుతరువాత వచ్చి నీ యర్పణము నర్పింపుము" (మత్తయి 5:23, 24).
>
> "మరియు నీ సహోదరుడు నీ యెడల తప్పిదము చేసిన యెడల నీవు పోయి, నీవును అతడును ఒంటరిగా నున్నప్పుడు అతనిని గద్దించుము; అతడు నీ మాట వినిన యెడల నీ సహోదరుని సంపాదించుకొంటివి" (మత్తయి 18:15).

సమర్థులైన నాయకుల పేర్ల జాబితాను సిద్ధపరిచి తరువాత వారిని విమర్శించవద్దు. మీ సహోదరులతో ఇప్పుడే సమాధానపడు. మీ ముందున్న కొద్ది కాలంలోనే సంఘంలోని మీ సంబంధాలను మెరుగు పర్చుకోండి. ప్రత్యేకించి ఎన్నో ఏళ్ళగా క్షీణించిన మీ సంబంధాలను నూతనపర్చండి.

## ప్రార్థించండి

ఒక సంఘంగా మనం చేయాల్సిన పని ప్రార్థన. పెద్దలను ఎన్నుకునే ప్రక్రియలో ఇది మరింత ఆవశ్యకం. పెద్దల పేర్లను మనం ప్రతిపాదించే రోజున మరింతగా "ఎడతెగక ప్రార్థించాలి" (1 థెస్సలొనీయులకు 5:17).

## ఇప్పుడే సన్నద్ధం కాండి

మిగిలిన కొద్ది సమయంలో, సంఘస్థుల దృష్టిని సంఘ పురుషుల మీద మళ్ళించండి. సంఘంలో మీరు పురుషులైతే, పెద్దగా ఉండుటకు మిమ్మల్ని మీరు సిద్ధపర్చుకోండి. (సంఘంలోని ప్రతి పురుష సభ్యులతో, వారు ఏ వయస్సు వారైనా, నేను వారందరికి చెప్పుచున్నాను.) పెద్దలనే వారు అరుదైన వారని ఎక్కువ మంది పెద్దల అర్హతలను సాధించలేరని భావిస్తుంటారు. అయితే, ఈ పాఠాల క్రమంలో ఒక్క విషయం మాత్రం స్పష్టమవుతుంది, అది *పెద్దలకు నిర్దిష్ట ప్రత్యేక లక్షణాలంటూ ఏమీలేవు.* క్రొత్తనిబంధనలోని క్రైస్తవులకు అన్వయించలేని లక్షణాలు 1 తిమోతి 3 మరియు తీతు 1లో లేవు. పెద్దలు క్రొత్తగా రక్షణ పొందిన వారైయుండక, వివాహం చేసుకొని కుటుంబం కలిగియుండు వారైయుండాలి కానీ ఈ లక్షణాలు కూడ క్రైస్తవ పురుషులలో ఎక్కువ మందికి వర్తిస్తాయి.

అయితే నేను చెప్పేదేమంటే, 1 తిమోతి 3 మరియు తీతు 1లో చెప్పబడిన లక్షణాలు లేదా అర్హతలు కుంటుంబం కలిగియున్న ప్రతి క్రైస్తవ పురుషునికి *ఉండాలి.* అతడు పెద్దగా పనిచేసినా లేకున్నా అందరికీ ఇవి ఉండాలి ఈ అర్హతలకు మీరు సమీపంగా ఉంటే, మీరు మరింత క్రైస్తవునిగా ఉండి ప్రభుని సేవించగలరు. ఆ అర్హతలను చదవండి, వాటిని ఆలోచించండి. వాటి విషయమై ప్రార్థించండి. ఆ అర్హతల వెలుగులో మిమ్మల్ని మీరు పరీక్షించుకోండి మీరు ఇంకా అవలంబించాల్సిన లక్షణాలను గురించి ఆత్మీయంగా పెద్దలైన వారిని అడగండి తరువాత పౌలు తిమోతి. తీతుతో వివరించిన వ్యక్తిగా వుండేందుకు ప్రయత్నించండి.

మంచి పెద్దలుగా నుండేందుకు కొంతకాలం పడుతుంది. ఒక సంఘం ప్రారంభించబడి ఎంతో కాలమైనా, అందులో పెద్దలెవరూ లేకుంటే, ఆ సంఘంలోని వారు విశ్వాసంలో ఎదగట్లేదు అని అర్థం. ఈనాడు దేవుని సంఘానికి అర్హత కలిగిన మంచి పెద్దల అవసరం ఎంతో ఉంది; అలాగే భవిష్యత్తులోనూ వీరి అవసరం ఎంతో ఉంది. పెద్దలను వృద్ధిచేసే పని మరెవరిదో కాదు, అది మీదే.

## సానుకూల నాయకత్వన్ని పెంపొందించుకోండి

మీరింత వరకు ఇలా చేయకుంటే, ఇప్పుడే మీ సంఘంలో సానుకూల నాయకత్వాన్ని అనుసరించేలా నేను మిమ్మల్ని ప్రోత్సహిస్తున్నాను. మీ ఉద్దేశాల్ని ఇతరుల మీద రుద్దడం గురించి నేను మాట్లాడడం లేదు. కానీ ఈ చర్యలు తీసుకోవడం గురించి నేను మాట్లాడుతున్నాను.

- సంఘ పనిలో చురుగ్గా పాల్గోనడం.
- బాధ్యతను అంగీకరించడం.
- అప్పగించబడిన పనులు జరిగేలా చూడడం.
- ఇతరులూ పాల్గొనేలా చూడడం.
- సంఘం గురించి, సంఘ పని గురించి ఇతరులతో సానుకూలంగా మాట్లాడడం.

మనం మనుష్యులను ఎన్నుకుని వారిని నాయకులుగా *తయారుచేయడం* లేదుగాని, నాయకులుగా *నున్న వారినే* ఎన్నుకుంటున్నాము. అంటే, సంఘం చేత నాయకులుగా ఎంచబడిన వారు, చూడబడిన వారు, అలాగే చెప్పబడ్డ అర్హతలను కలిగియున్న వారినే మనం నాయకులుగా ఎన్నుకుని వారినే నాయకులుగా అధికార పూర్వకంగా ప్రకటిస్తున్నాము.

1 తిమోతి 3 మరియు తీతు 1లో చెప్పబడిన అర్హతలను కలిగియున్న మంచి వ్యక్తులు నాకు తెలుసు కానీ కొన్ని కారణాల చేత వారు సంఘ కార్యకలాపాల నుండి దూరమైపోయారు. తమ సామర్థ్యం, తమ ఆలోచనలు, తమ నాయకత్వం ద్వారా వారు సంఘాన్ని దోచుకోవడంతో పాటు తమ్మును తాము దోచుకుంటున్నారు. ఇక్కడ వృద్ధాప్యంలో నుండి కూడా మంచి ఆరోగ్యంతోనున్న వారిని గురించి ప్రస్తావిస్తున్నాను. క్రైస్తవులకు పదవీ విరమణలు ఉండవు.[5] మనం చనిపోయినప్పుడు మాత్రమే ఆత్మీయంగా విరమణ పొందిన వారము. "అంతట – ఇప్పటి నుండి ప్రభువునందు మృతులు ధన్యులని వ్రాయుమని పరలోకము నుండి ఒక స్వరము చెప్పగా వింటిని నిజమే వారు తమ ప్రయాసములు మాని విశ్రాంతి పొందుదురు. వారిక్రియలు వారి వెంటపోవునని ఆత్మ చెప్పుచున్నాడు." అని వ్రాసేందుకు యోహాను ప్రేరేపించబడ్డాడు (ప్రకటన 14:13).

## ఇతరులతో కలిసి పని చేయడమును నేర్చుకోవడం

బృందంగా నుండి పనిచేయడంలో భాగంగా ఇతరులతో కలిసి పనిచేయాడాన్ని నేర్చుకోండి. ఆత్మీయంగా "ఒక్కడే సైన్యం" గా నుండే ప్రత్యేక వ్యక్తులు నాకు తెలుసు. వారు మంచి పనులే చేసినా, వారు భయంకర పెద్దలను తయారు చేశారు. సంఘంలో పెద్దల గుంపుఉండాలని, సంఘ పనిని పర్యవేక్షించేందుకు బృందం ఉండాలని వాక్యం బోధిస్తుంది. వీరందరూ కలిసి పనిచేయాలి, ఒక పెద్ద "స్వేచ్ఛాపరుడుగాకుండా" (తీతు 1:7) "సాత్వికుడై" యుండాలి (1 తిమోతి 3:3).

కాబట్టి, ప్రతి ఒక్కరూ ఇతరులతో కలిసి పనిచేయడం నేర్చుకోవాలని మిమ్మును కోరుతున్నాను మీ స్వేచ్ఛాయుత ఆపేక్షగాకుండా సంఘక్షేమాన్ని యోచించే వారుగా ఉండాలి. విశ్వాస విషయాలు మరియు అభిప్రాయ, సూచనల మధ్య తేడాను గ్రహించేవారుగా ఉండాలి. విమర్శ విషయంలో ఇతరులను గౌరవించడం నేర్చుకోండి. మీరనుకున్న విధానంలోనే అంతా ఉండాలని భావించకండి. ఇతరులతో కలిసి పని చేయడం అనేది మీకు మంచిది, సంఘానికి మంచిది, అలాగే రానున్న రోజుల్లో దేవుని సంఘ పరిచర్యకూ ఎంతో మంచిది.

## సేవకునిగా ఉండడమును నేర్చుకోండి

తరువాతదిగా, మీరు సేవకునిగా ఉండడమును నేర్చుకోవాలి. క్రైస్తవుడు అంటేనే సేవకుని లక్షణం ఉన్నవాడు. అలాగే పెద్దకు ఇది ఉండాలి. యేసు ఇలా అన్నారు,

> అన్యజనులలో అధికారులు వారిమీద ప్రభుత్వము చేయుదురు అనియు, వారితో గొప్పవారు వారి మీద అధికారము చేయుదురనియు మీకు తెలియును, మీలో ఆలాగుండకూడదు. మీలో ఎవడు గొప్పవాడై యుండగోరునో వాడు మీ పరిచారకుడై యుండవలెను మీలో ఎవడు ముఖ్యుడైయుండగోరునో వాడు మీ దాసుడైయుండవలెను. ఆలాగే మనుష్యకుమారుడు పరిచారము చేయించుకొనుటకురాలేదు గాని పరిచారము చేయుటకును అనేకులకు ప్రతిగా

విమోచన క్రయధనముగా తన ప్రాణము నిచ్చుటకు వచ్చెను (మత్తయి 20:25-28).

అలాగే "ఎవడైనను అధ్యక్షపదవిని ఆశించిన యెడల అట్టివాడు దొడ్డ *పనిని* అపేక్షించుచున్నాడను మాట నమ్మదగినది" (1 తిమోతి 3:1; నొక్కి చెప్పింది నాది) అని పౌలు వ్రాస్తున్నాడు. నేను ఎన్నటికిని పెద్దను కాలేకపోవచ్చు లేదా మీరు ఎన్నటికిని పెద్ద కాలేకపోవచ్చు. అదేమంత ప్రాముఖ్య విషయం కాదు. అయితే ప్రాముఖ్య విషయం మేమంటే, మన సామర్థ్యమును బట్టి మనం సేవ చేయుటలో కొనసాగుతున్నాము. మనలోనే కొంతమంది సేవకత్వం అంటే ఏమిటో ఎన్నటికి గ్రహించకుండా యుంటారని నేను భయపడుతున్నాను. అంటే, ఇతరులను మనకంటే ఉన్నతులుగా ఎంచడం, ఇతరుల మేలు కొరకు మనం కష్టపడడం వంటి పరిచర్య లక్షణాలను నేర్చుకోలేకయున్నారు.

## కాపరి హృదయాన్ని అలవర్చుకోండి

బహుశా నేనిచ్చే ప్రాధాన్య సలహా ఇదే: కాపరి హృదయాన్ని కలిగియుండేందుకు ప్రయత్నించండి. 1 తిమోతి 3 మరియు తీతు 1లో చెప్పబడిన అర్హతల జాబితాను తక్కువ చేయకుండానే పెద్దలు ఎలా ఉండాలి, ఏం చేయాలి అన్న విషయాల్లో వారిని గురించిన మరికొన్ని అర్హతలు కనబడతాయి. క్రొత్త నిబంధనలో పెద్దల నిమిత్తం వాడబడిన పదాలను గురించి మనం తరువాత చర్చించుదాము. ఇప్పుడు వాటినిక్కడ క్లుప్తంగా చూద్దాము:

- "పెద్ద." ఇది *ప్రెస్బిటర్* అన్న గ్రీకు పదం యొక్క తర్జుమా పదం, దీనికి "వృద్ధుడు" అని అర్థం. ఇది వ్యక్తి యొక్క వయస్సును గాక, అతని ఆత్మీయోన్నతిని సూచిస్తుంది. పెద్దలు ప్రాథమికంగా ఆత్మీయతలో ఎదిగిన వారైయుండాలి. వీరు పిల్లల చేష్టలను ప్రదర్శించువారుగా నుండకూడదు.
- "అధ్యక్షుడు" (బిషప్) (అపొస్తలుల కార్యములు 20:28 చూడండి; KJV). ఇది "*ఎపిస్కోపోస్*" అన్న గ్రీకు పదం యొక్క సరికాని భాషాంతర పదము. దీనికి "పైవిచారణకర్త" అని అర్థము. అంటే, పెద్దలు తామున్న సంఘం యొక్క పనిని చూచువారు అన్న అర్థమును ఇది ఇస్తుంది. పెద్దలు సద్విమర్శ చేయువారై యుండాలి.
- "కాపరి" (పాస్టర్) ఇది "పోయిమెన్" ఇను గ్రీకుపదం యొక్క అనువాదము. "*పోయిమెన్*" యొక్క క్రియా రూపక పదం అపొస్తలుల కార్యములు 20:28 మరియు 1 పేతురు 5:2లోని పెద్దలను సూచిస్తుంది. అలాగే దీని నామవాచక పదం ఎఫెసీయులకు 4:11లో వాడబడింది. "కాపరి" (pastor) అను పదం లాటిన్ లోని "కాపరి" అను పదం నుండి వచ్చింది. ఈ పదం పెద్ద ఎలా ఉండాలి, ఏం చేయాలి అన్న విషయాన్ని స్పష్టంగా చెప్తుంది. దేవుని ప్రజల నాయకుని వివరించే మంచి పదాల్లో "కాపరి" ఒకటి.

కాపరుల గురించి మరియు మన కాపరులు (పెద్దలు) మంద (సంఘం) పై చూపే ప్రభావం గురించి వాక్యం ఏం సూచిస్తుందో తరువాత పాఠంలో చూద్దాము. ఇప్పుడు, ప్రతి ఒక్కరూ కాపరి హృదయం కలిగియుండాలని నేను కోరుతున్నాను.

*మంచి* కాపరి ఎలా ఉంటాడు, ఆయన ఏం చేస్తాడు అన్న విషయాన్ని తెలుసుకునేందుకు మంచి కాపరి, ప్రధాన కాపరియైన యేసు వైపు చూడండి (1 పేతురు 2:25; 5:4). నశించిన దానిని వెదకి రక్షించేందుకు ఆయన వచ్చారు (లూకా 19:10). త్రోవ తప్పి నశించిన వారిని రక్షించేందుకు ఆయన హృదయం పరితపిస్తుంది. ఆయన వారిని వెదకి తిరిగి తెస్తారు (యోహాను 10). చెడ్డకాపరి గురించి తెలుసుకునేందుకు యెహెజ్కేలు 34, సంబంధిత వాక్యభాగాలను చూడండి. యెహెజ్కేలు 34:4 ఇలా చెప్తుంది,

> "బలహీనమైన వాటిని మీరు బలపరుచరు, రోగము గల వాటిని స్వస్థపరచరు, గాయపడిన వాటికి కట్టు కట్టరు, తోలివేసిన వాటిని మరల తోలుకొని రారు, తప్పిపోయిన వాటిని వెదకరు అది మాత్రమే గాక మీరు కఠిన మనుస్కులై బలత్కారముతో వాటిని ఏలుదురు."

ఆత్మీయంగా బలహీనంగా నున్న, ఆత్మీయంగా వ్యాధిగ్రస్తులై, ఆత్మీయంగా నలిగిపోయి, చెదిరిపోయి నశించిన ఇశ్రాయేలు వారిని ఇశ్రాయేలు కాపరులు పట్టించుకొని యుండాల్సింది. కాపరి అంటే ఇదే.

కాపరి హృదయం కలిగియుండడం గురించి నేను నొక్కి చెప్తున్నాను, ఎందుకంటే పెద్దలను సాధారణంగా సంఘ కమిటీ మెంబర్లుగానే చాలా మంది చూస్తారు. స్థానం, ఆధిపత్యం, పరువు కోసం ఆశపడిన వారిని అనేకమందిని నేను చూశాను. పెద్దలు నిర్ణయాలు తీసుకోవాలి కానీ వారు చేయాల్సింది అదొక్కటే కాదు పెద్దగా ఉండడమంటే ప్రజలు నిమిత్తం పని చేయడమే.

సంఘంలో పెద్దల నిమిత్తం మీరు చూస్తున్నప్పుడు మీరు గమనించాల్సిన ఒక విషయమేమంటే, వారికి ప్రజల పట్ల శ్రద్ధవహించే హృదయం ఉందా లేదా అని! వారు ఇతరులను ప్రోత్సహించేందుకు ప్రయత్నిస్తున్నారా? సత్యం నుండి తొలగిపోయిన వారిని మరలా దరి చేర్చేందుకు వారు ప్రయత్నిస్తున్నారా?

మరలా చెప్పుచున్నాను కాపరి హృదయం కలిగియుండేందుకు ప్రయత్నించండి.

## పరిచర్య చేసేందుకు సిద్ధంగా ఉండండి

నా చివరి సూచన, విన్నపం ఏమంటే, రాజ్య విస్తరణ కోసం మీరు పని చేయునప్పుడు మీరు పరిచర్య చేసేందుకు సిద్ధంగా ఉండండి. 1884లో జనరల్ విలియం. టి. షెర్మన్ అమెరికా అధ్యక్ష పదవికి వెళ్తున్నాడన్న మాటలకు, వాదనలకు ఫుల్‌స్టాప్ పెడుతూ ఈ వ్యాఖ్యాలు చేశాడు, "నేను నామినేట్ చేయబడితే, నేను రాను, ఒకవేళ నేను ఎన్నుకోబడితే నేను సేవచేయను." పెద్దగా ఎన్నిక చేయబడిన తరువాత కూడా ఇలా చెప్పే వారు కొంతమంది నాకు తెలుసు. మత్తయి 25లోని తలాంతుల ఉపమానం చూడండి. ఐదు తలాంతులు ఉన్న వ్యక్తి తన దగ్గర ఉన్న ఒకటి లేదా రెండు తలాంతులనే ఉపయోగించుకోవాలనుకుంటే ఎలా ఉండేది? ఒక వ్యక్తి పెద్దగా అర్హుడైయుండి, సంఘంచేత సేవ కోసం అడుగబడినప్పుడు అతడు అందులో విఫలమైతే ఎలా ఉంటుంది?

సంఘాన్ని పెద్దల పేర్లను సూచించమనడం బాగుంటుంది కానీ వారందరిని మనం పెద్దలుగా ఎంపిక చేయలేం. ఎంచబడిన పేర్లు గల వారందరిని మనం నియమించలేము కొందరే అందుకు అర్హులు. కానీ ఇదీ మంచిదే! ప్రాముఖ్య విషయమేమంటే, ఒక వ్యక్తి

పెద్దగా నుండడం కాదుగాని, తన పూర్తి సామర్థ్యంతో సేవ చేయడం. ఒకవేళ సంఘమంతా ఏకగ్రీవంగా మిమ్ములను ఆ పని నిమిత్తం ఎన్నుకుంటే దానికి మీరు యోగ్యులు కారని మీకనిపిస్తే, "నేను యోగ్యుడను కాను. అయినా దేవుని సహాయంతో ఈ బాధ్యతను నేను తీసుకొని నా శాయశక్తులా పరిచర్య చేస్తాను" అని మీరు చెప్పాలి.

**ముగింపు**

పెద్దలను ఎన్నుకునే విషయమై ఎన్నో విషయాలను చెప్పవచ్చుగానీ, ప్రస్తుతం మీ ముందు ఒక సవాలును ఉంచుతూ ముగిస్తున్నాను: ఏం జరిగినా, *క్రైస్తవులముగా* ప్రవర్తిస్తూ "లోపముగా ఉన్నవాటిని దిద్దాలి."

- మీరు ఎన్నిక చేయబడకపోతే లేదా చేయబడితే మీరు ఎలా ఉంటారు! *క్రైస్తవునిగా* ప్రవర్తించండి. మీ గర్వాన్ని, అధికారాన్ని ప్రక్కనబెట్టి మీరున్న చోటనే పరిచర్య చేయండి.
- ఈ వ్యక్తి ఎన్నిక చేయబడతాడని మీరనుకున్నప్పుడు అతడు ఎన్నిక కాకుంటే ఎలా ఉంటుంది? కఠినంగా మాట్లాడకుండా *క్రైస్తవునిలా* ప్రవర్తించండి.
- మీరు పెద్దగా ఉండేందుకు అర్హులు కారని ఇతరులు మీ మీద చెడ్డమాటలు పలికినప్పుడు ఏం చేస్తారు? ఆ మాటలు అన్న వారి దగ్గరకు వెళ్ళి వారితో మాట్లాడండి, ఏ కక్షా పెట్టుకోవద్దు. *క్రైస్తవునిలా* ప్రవర్తించండి.
- ఒక వ్యక్తి పెద్దగా ఉండేందుకు అర్హుడు కాదని మీరు భావించిన వ్యక్తి పెద్దగా ఎన్నిక చేయబడితే ఏం చేస్తారు? ఒక వ్యక్తి పెద్దగా ఉండేందుకు పూర్తిగా, ఏ ఒక్క అర్హత లేనివాడు అయితే, అతడున్న స్థానాన్ని బట్టి అతడ్ని గౌరవించండి, *క్రైస్తవునిలా* ప్రవర్తించండి.

దీన్ని ప్రార్థనతో, ఆహ్వానంతో ముగించండి. ఆహ్వాన పిలుపులో సంఘంలో చురుగ్గా పాల్గొనేందుకు పిలుపు నివ్వండి.

---

**తీతు 1:5కు సంబంధించి మరికొన్ని విషయాలు**

"నేను నీకాజ్ఞాపించిన ప్రకారము నీవు లోపముగా నున్న వాటిని దిద్ది, ప్రతి పట్టణములోను పెద్దలను నియమించు నిమిత్తమే నేను క్రేతులో నిన్ను విడిచి వచ్చితిని ..." (తీతుకు 1:5) అని పౌలు తీతుకు వ్రాస్తున్నాడు. "అవసరమగు వాటిని (లోపముగా నున్న వాటిని) సరిదిద్ది" అని KJVలో వ్రాయబడింది. సంఘంలో పెద్దలు లేకుంటే అక్కడ ఏదో లోపించింది.

మొదట యెరూషలేములో సంఘం స్థాపించబడినప్పుడు, సంఘ కార్యకలాపాలను అపొస్తలులే నిర్వహించే వారు (అపొస్తలుల కార్యములు 2:42; 6:2). కొంత కాలానికి పెద్దలు నియమించబడ్డారు (అపొస్తలుల కార్యములు 11:30; 15:2). తరువాత, పౌలు యెరూషలేములోని నిస్సహాయ సహోదరుల కోసం కానుకను తీసుకువచ్చినప్పుడు అక్కడ పెద్దల పేర్లు మాత్రమే పొందు పరచబడ్డాయి (అపొస్తలుల కార్యములు 21:18). బహుశా అపొస్తలులు సంఘ పనిని పెద్దలకు అప్పగించి సువార్త పని నిమిత్తం అప్పటికే

వెళ్ళిపోయారు.

పౌలు తన మిషనరీ యాత్రల్లో, ఎక్కడ లోపంగా ఉందో అక్కడ ప్రతి పట్టణంలోను పెద్దలను నియమించాడు (అపొస్తలుల కార్యములు 14:23). అతడు పరిచర్య చేసిన పట్టణాల్లో ఒకటి ఫిలిప్పీ పట్టణం, అక్కడి వారికి తాను ఒక పత్రికను వ్రాస్తూ, "ఫిలిప్పీలోని అధ్యక్షులకును [పెద్దలు], పరిచారకులకును" అని పేర్కొన్నాడు (ఫిలిప్పీయులకు 1:1; చూడండి తీతు 1:5, 7). అతడు పరిచర్య చేసిన మరో ప్రాంతం, ఎఫెసు పట్టణం ఎఫెసు సంఘపు పెద్దల గురించి మనం అపొస్తలుల కార్యములు 20:17లో చూస్తాము.

పౌలు తన ఇద్దరు సహాయకులైన తిమోతి మరియు తీతులకు వ్రాస్తూ అర్హులైన పెద్దల అవసరత గురించి చెప్తున్నాడు. తిమోతికి వ్రాసిన మొదటి పత్రికలో అధ్యక్షులు, పరిచారకులను గురించి వ్రాస్తున్నాడు (1 తిమోతి 3:1–13). "... దేవుని మందిరములో అనగా జీవముగల దేవుని సంఘములో జనులేలాగు (నీవేలాగు) ప్రవర్తింపవలెనో అది నీకు తెలియవలెనని ఈ సంగతులు నీకు వ్రాయుచున్నాను" (14, 15 వచనాలు). ముందుగా చెప్పినట్లే, "నేను నీకాజ్ఞాపించిన ప్రకారము నీవు లోపముగా ఉన్న వాటిని దిద్ది, ప్రతి పట్టణములోను పెద్దలను నియమించు నిమిత్తమే నేను నిన్ను క్రేతులో విడిచి వచ్చితిని ..." (తీతు 1:5) అని తీతుకు వ్రాశాడు.

పెద్దలు లేకుండా సంఘం ఉండగలదా? ఉండగలదు. పౌలు మొదటి మిషనరీ ప్రయాణంలో సంఘాలను స్థాపించాడు, రెండవ ప్రయాణంలో మరలా దర్శించినప్పుడు పెద్దలను నియమించాడు. మొదటి మరియు రెండవ ప్రయాణాల మధ్య కాలంలో సంఘాలు పెద్దలు లేకుండా ఉన్నాయి. అయినా అవి వాక్యానుసారంగానే ఉన్నాయి.

సంఘంలో పెద్దలు నియమించబడేంతవరకు అది తమ కార్యకలాపాలను విస్తృతంగా చేయలేదు. పెద్దలు లేని కొన్ని సంఘాలలో నెలవారి పురుషుల కూడికను పెట్టుకుని కొన్ని నిర్ణయాలను తీసుకుంటారు అయితే ఇటువంటి విషయాలన్నీ పెద్దలు నియమించబడేంత వరకు కేవలం ప్రత్నామ్నాయ తాత్కాలిక ఏర్పాట్లలో మనం తృప్తి చెందకుండా స్థిరమైన ఏర్పాట్లను చేసుకోవాలి.[6]

నాకు దేవుని మనస్సు ఏమిటో తెలియదు కాబట్టి ప్రతి సంఘంలోను పెద్దలను నియమించడం ఎందుకంత ప్రాముఖ్యమైందో నేను చెప్పలేదు. అయినా కొన్ని విషయాలను చెప్తున్నాను. పెద్దలు లేకపోతే, సంఘంలో అధీకృత వ్యవస్థ అంటూ ఉండదు. పెద్దలు లేకపోతే, సంఘంలో అధీకృత నిర్ణయాధికారం ఉండదు. పెద్దలు లేకపోతే, సరైన బాధ్యతల కేటాయింపు ఉండదు. పెద్దలు సంఘం యొక్క ఉనికికి ప్రధానం కాదు గాని, దాని క్షేమాభివృద్ధికి ఎంతో ప్రధానం.

దేవుడు చెప్పాడు కాబట్టి మనం చేద్దాము: దీనితో ఆరంభించి, ప్రతి సంఘంలోనూ పెద్దలను నియమించుట ప్రయాస పడుదాం.

---

సూచనలు

[1]తీతు 1:5 యొక్క నేపథ్యమును మీరు వివరించవచ్చు. దీని విషయమై కొన్ని విషయాలు పాఠం చివర్లో ఇయ్యబడ్డాయి. [2]ఎన్నో సంవత్సరాల నుండి ఉనికిలోనున్న సంఘాలకు మాత్రమే ఈ పేరా అన్వయించబడుతుంది. [3]NASB "ఆశించడం" అని ఉంది. [4]"అపేక్షించడం" యొక్క గ్రీకు పదాలు తరువాత పాఠంలో చర్చించబడ్డాయి. [5]ఈ పదాలు మీ శ్రోతలకు పరిచయమైనవైతే

మీరిలా చెప్పవచ్చు – “దేవుని దృష్టిలో రిటైర్‌మెంట్ ప్లాన్ అనేది లేదు.” [6]ఇక్కడ సమతుల్యత అవసరం. ప్రతి సంఘానికి పెద్దలు అవసరం. అలా అని అర్హులైన వారులేకున్నా దాని కోసం తొందరపడడం తగదు. “లోకానుసార వ్యవస్థీకృతం కంటే వాక్యానుసార అవ్యవస్థ మేలు” అని ఒకరు అన్నారు.